సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 11 । జూలై । 2023



ఇద్దరికి పాముకాటు 8లో

మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



సురక్షతో పరిష్కారం 8లో

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు.



గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

చింతపల్లి, గూడెంకొత్తవీధి, వై.రామవరం మండలాల గర్భిణులకు వైద్యాధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

జగనన్న సురక్షలో 6,024 ధ్రువపత్రాల పంపిణీ

సాక్షి, పాడేరు: జిల్లాలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 6,024 ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 మండలాల పరిధిలోని 15 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని, 13,969 గృహాల నుంచి వలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 11,861 వినతులు రాగా వీటికి సంబంధించి 15,724 టోకెన్లు జారీ చేశామన్నారు. దరఖాస్తులు 13,950 ఆన్‌లైన్ చేయగా వీటిలో 6,024 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. దరఖాస్తులు 71 తిరస్కరణకు గురికాగా మిగిలిన 7,885 సర్టిఫికెట్లను రెండురోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యతో మంచి ఫలితాలు

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- విద్యార్థుల పఠనా సామర్థ్యం పరిశీలన



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: నాణ్యమైన విద్య బోధిస్తే మంచి ఫలితాలు సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలోని బాలారం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా ఆమె పలు ప్రశ్నలు అడిగారు. అందుకు విద్యార్థులు సరియైన సమాధానాలు చెప్పడంతో ఆమె సంతృప్తి చెందారు. అంతకుముందు ఆమె పాఠశాలలో నాడు- నేడు పనులను పరిశీలించారు. జేఈ రామకృష్ణ నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ముల్లుమెట్టలో షూటింగ్ సందడి



చిత్రీకరణలో నిమగ్నమైన బృందం సభ్యులు

కొయ్యూరు: గిరిజన స్థితిగతులపై సినిమాను చిత్రీకరిస్తున్నామని నర్సీపట్నానికి చెందిన దర్శకుడు గవిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆదర్శ బాలకృష్ణ హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌ను మూలపేట పంచాయతీ ముల్లుమెట్టలో సోమవారం ప్రారంభించినట్టు చెప్పారు. గిరిజనుల జీవన విధానం,వారి ఆర్థిక స్థితిగతులతో పాటు అనేక అంశాలపై చిత్రీకరణ చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో గిరిజన జీవనం ఉట్టిపడేలా ఉందన్నారు. దీంతో ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నామని ఆయన తెలిపారు. కోడైరెక్టర్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

లోతుగెడ్డలో విస్తృత తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమణ

చింతపల్లి రూరల్: మండలంలో లోతుగెడ్డ బ్రిడ్జి వద్ద సోమవారం ఎస్‌ఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా తనిఖీ చేపట్టామన్నారు. వాహన రికార్డులను పరిశీలించారు. వాహన రికార్డులను తమ వెంటే తీసుకురావాలని ఆయన సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న బాలరాజు

వై.రామవరం: మండలంలోని చింతకర్ర పాలెం గ్రామానికి చెందిన కేలీల బాలరాజు(40) అనే వ్యక్తి ఆదివారం రాత్రి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తప్పతాగిన మైకంలో తమతో తగాదా పెట్టుకుని పురుగుల మందు సేవించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయట పడినట్టు వైద్యాధికారి రాహుల్ తెలిపారు.

పెల్లుబికిన నిరసన

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్లు ధ్వజం
- తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిక
- పాడేరులో రేపు భారీ ఎత్తున ఆందోళన
- సంఘ ప్రతినిధులు కొమ్మా రాంబాబు, కొమ్ము సురేష్‌కుమార్ వెల్లడి

నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామవలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ గ్రామ వలంటీర్లంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈనెల 12న పాడేరులో భారీస్థాయిలో ఆందోళన చేపడుతున్నట్టు ప్రకటించారు. పవన్ కల్యాణ్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వారు ధ్వజమెత్తారు.



వనగుమ్మ సచివాలయంలో మాట్లాడుతున్న మండల వలంటీర్ల సంఘ అధ్యక్షుడు దేవా



పాడేరు-1 గ్రామ సచివాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు

పాడేరు రూరల్ : గ్రామ వలంటీర్లపై నీచపు ఆరోపణలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు, గ్రామ వాలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్‌కుమార్ హెచ్చరించారు. ఏలూరు సభలో గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వాఖ్యలను వారు ఖండించారు. దీనిలో భాగంగా సోమవారం వారు పాడేరులో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని గ్రామసచివాలయం -1, చింతలవీధి గ్రామ సచివాలయంలో వలంటీర్లు ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. పవన్ కల్యాణ్ తన వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని భేషరతుగా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు, సురేష్‌కుమార్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ఎటువంటి లాభాపేక్ష లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హుల గడప వద్దకు వెళ్లి అందజేస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ అధికారికంగా ఏ పదవి, హోదాలో ఉన్నారని కేంద్ర నిఘా వర్గాలు అతడికి రాష్ట్ర సమాచారం ఇస్తాయని ప్రశ్నించారు. కనీస పరిజ్ఞానం లేకుండా పవన్ కల్యాణ్ మాట్లాడటం అతడి అవివేకానికి నిదర్శమన్నారు. కరోనా కష్ట కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతీ ఇంటి తలుపు తట్టి వారి యోగక్షేమాలు తెలుసుకొని వారికి సపర్యలు చేసిన ఘనత గ్రామ వలంటీర్లదేనన్నారు. ప్రతీనెలా ఒకటవ తేదీన పొద్దు పొడవక ముందుగానే అవ్వతాతలకు పెన్షన్ అందజేసి వారి కళ్లల్లో ఆనందం నింపుతున్న ఘనత గ్రామ వలంటీర్లదేనన్నారు. ఇవేవీ పవన్ కల్యాణ్‌కు తెలియదా, చూడలేదా అని వారు ప్రశ్నించారు. అవివేకంతో మాట్లాడితే పథకాలు తీసుకుంటున్న అర్హులైన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పవన్ వాఖ్యలకు నిరసనగా జిల్లా కేంద్రమైన పాడేరులో ఈనెల 12న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని వారు హెచ్చరించారు.

నిస్వార్థ సేవలపై నీచ రాజకీయం తగదు

ముంచంగిపుట్టు: జగనన్నను ఎదుర్కొనే సత్తాలేక.. రాష్ట్రంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ నీచ రాజకీయాలు చేయడం తగదని మండల వలంటీర్ల సంఘ అధ్యక్షుడు జి.దేవా ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని వనుగుమ్మ గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లంతా సమావేశమయ్యారు. పవన్ కళ్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవా మాట్లాడుతూ ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని రాష్ట్ర ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, రాష్ట్రానికి వెన్నుముఖలాంటి వలంటీర్లపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తామంతా ఖండిస్తున్నామన్నారు.

సకాలంలో నాడు–నేడు పనుల బిల్లులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్



హాజరైన వివిధ శాఖల అధికారులు

- ఎప్పటికప్పుడు అప్‌లోడ్
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

పాడేరు రూరల్ : ఏజెన్సీలో చేపడుతున్న నాడు-నేడు పనులకు సంబంధించిన పూర్తయిన వాటికి సకాలంలో బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నాడు-నేడు పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఎంల దగ్గర బిల్లుల అప్‌లోడింగ్‌కు సంబంధించి బిల్లులు చాలా పెండింగ్‌లో ఉన్నాయన్నారు.పనులకు సంబంధించి ఫొటోలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దశలవారీగా తీయడం లేదన్నారు. రెండో దశలో మంజూరైన పనులకు సంబంధించి అంచనాలను శుక్రవారం నాటికి పూర్తి చేయాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన సామగ్రిని స్థానికంగానే కొనుగోలు చేయాలని ఆదేశించారు. నాడునేడు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఐసీడీఎస్ పీడీ నాగమణి, నాడు–నేడు ఏపీవో పాత్రుడు, ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, ఏఈలు, డీఈలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మన్యం అందాలు అద్భుతం

- రాష్ట్ర శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన మోషేన్‌రాజు తదితరులు

అరకులోయ రూరల్ : మన్యం ప్రాంత అందాలు అద్భుతమని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు అన్నారు. మన్యం పర్యటనలో భాగంగా సోమవారం ఆయన అరకులోయలో పర్యటించారు. స్థానిక గిరిజన మ్యూజియం, కాఫీ హౌస్, ఘాట్ రోడ్డులోని కాఫీ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మన్యం ప్రాంతంలో సహజసిద్ధమైన ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. అరకులోయ, అనంతగిరి ఘాట్‌రోడ్డు మార్గంలో అందాలు మైమరిపించాయన్నారు. రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పర్యాటకరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. సందర్శిత ప్రాంతాలు గతంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎంతగానో అభివృద్ధి చేసిందన్నారు. గిరిజన మ్యూజియంలో ఆదివాసీలు ఆచార సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటుచేసిన కళాకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- దృష్టి సారించిన వైద్య ఆరోగ్యశాఖ
- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు



స్కూల్ వద్ద ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

రంపచోడవరం: ఏజెన్సీలో సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వ్యాధుల బారిన పడిన వారికి ప్రత్యేకంగా వైద్య సేవలు అందించేందుకు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పటిష్టమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది.

- ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షించి జ్వర బాధితులు ఉంటే ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ఏజెన్సీలో ప్రతీ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండడంతో ఒక వైద్యుడు ఓపీ అనంతరం స్థానికంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. విద్యార్థులు వ్యాధుల బారి నుంచి రక్షించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

పీవో ఆదేశాలకు అనుగుణంగా..

రంపచోడవరంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏజెన్సీలో మలేరియా, సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ప్రతీ పీహెచ్‌సీలో మలేరియా ర్యాపిడ్ కిట్లు , మందులు అందుబాటులో ఉంచారు. మొదటి విడత మలేరియా మందు స్ప్రేయింగ్ పూర్తి కావడంతో రెండో విడతపై ప్రారంభమైంది.

- ఎంపిక చేసిన 126 గ్రామాల్లో వచ్చే నెల 15వ తేదీ నాటికి స్ప్రేయింగ్ ప్రక్రియ పూర్తి అవుతుంది.
- దోమ తెరల వినియోగంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో మలేరియా పాజిటివ్ కేసులు ఉంటే గ్రామంలో సర్వే చేసి వైద్య సేవలు అందిస్తున్నారు.

అందుబాటులో ల్యాబ్ టెక్నీషియన్లు



ఏజెన్సీలోని 19 పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉన్నారు. జ్వర బాధితులు వస్తే వెంటనే ర్యాపిడ్ కిట్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మలేరియా నిర్ధారణ అయితే మందులు అందజేస్తున్నారు. ఏజెన్సీలో 2020లో దోమ తెరలు పంపిణీ చేశారు. మరో విడత 2024లో అందజేస్తారు. ఏజెన్సీలో సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాం.

– అనూష, ఏడీఎంహెచ్‌వో, రంపచోడవరం

జర్నలిస్టులు బాధ్యతగా పనిచేయాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ



అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. రెండేళ్ళ కాలపరిమితితో రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు మంజూరు చేసిన నూతన అక్రిడిటేషన్ కార్డులతో పాటు ఆర్టీసీ బస్ పాసులను సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అందజేశారు. జిల్లాలో తొలిదశలో 125 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేశామని, అర్హత కలిగిన మిగిలిన జర్నలిస్టులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి త్వరగా అందజేయాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి గోవిందరాజులను ఆదేశించారు. జర్నలిస్టుల కోసం త్వరలోనే మెగా మెడికల్ నిర్వహించాలని, ప్రయివేటు పాఠశాలల్లో చదువుకుంటున్న జర్నలిస్టుల పిల్లల కోసం 50 శాతం ఫీజు రాయితీపై పాఠశాల యాజమాన్యాలు, ఎంఈవోలు, డీఈవోకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి, పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, పీఆర్వో రాములు, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కొంటా దుర్గారావు, జవ్వాది శ్రీనివాస్, డూరు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

- ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు అవకాశం
- 3నెలల శిక్షణ అనంతరం ఉపాధి
- టెక్‌మహీంద్ర ఫౌండేషన్ డైరెక్టర్ మయూర్

దొండపర్తి: టెక్ మహీంద్ర ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ సంస్థ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కోర్సు అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జాబీ జంక్షన్ ప్రాంతంలో ఉన్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో గానీ, 9502874304, 9908104113 నెంబర్లకు ఈ నెల 15లోగా సంప్రదించాలని సూచించారు.

సంక్షేమానికి అర్హతే ప్రామాణికం

- వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ



ధ్రువపత్రం అందజేస్తున్న చొక్కాకుల వెంకట్రావు, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

కొయ్యూరు: పథకాలు పొందేందుకు అర్హతే ప్రామాణికమని, టీడీపీ మాదిరిగా లబ్ధిదారుల ఎంపికలో పార్టీలను చూడటం లేదని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకట్రావు అన్నారు. సోమవారం బాలారం సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలకోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వారికి లంచాలు ఇస్తేనే పనులు జరిగేవన్నారు. ఒకప్పుడు ధ్రువపత్రాలకోసం ఎంత దూరం నుంచైనా మండలకేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీలు అడిగినంత ఇస్తేనే పని జరిగేదన్నారు. మహా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. గ్యాస్,పెట్రోల్, పప్పుల ధరలు పెంచేది కేంద్రమని, రాష్ట్రం కాదన్నారు.అయితే టీడీపీ నాయకులు ఇదంతా రాష్ట్ర ప్రభుత్వమే చేస్తోందని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. వారి ప్రచారాన్ని ఎవరూ నమ్మవదని కోరారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ హామీలను నమ్మితే నిండా మునిగిపోతామన్నారు. నాడు అమ్మ ఒడిపై విమర్శలు చేసిన చంద్రబాబు నేడు అమ్మకు వందనం పేరిట ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి డబ్బులు వేస్తామని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారన్నారు. నాడు రుణమాఫీ పేరిట డ్వాక్రా, రైతులను ఎలా మోసం చేశారో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఒకవైపు గ్యాస్ ధరలు పెరిగిపోతుంటే ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నాయకుడు గాడి సత్యనారాయణ, ప్రచార కమిటీ అధ్యక్షుడు దోని బాబ్జీ, మండల ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు, మండల బూత్ కమిటీ కన్వీనర్ పాట్టిక పోతురాజు, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బకులూరు సర్పంచ్ పొట్టి శ్రీను,కంఠారం ఉప సర్పంచ్ వనంబాబు పాల్గొన్నారు. చొక్కాకుల వెంకట్రావును గ్రామ సచివాలయ సిబ్బంది, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సత్కరించారు.

రేపటి నుంచి గ్రామసభలు

వీఆర్‌పురం: మండలంలోని పోలవరం ముంపు పరిధిలోని ప్రాధాన్యత గ్రామాల్లో ఈ నెల 12వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.శ్రీధర్ తెలిపారు. ఈ గ్రామ సభల్లో గిరిజన నిర్వాసితులకు సంబంధించిన ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు,నిర్మాణం గురించి వారితో చర్చిస్తామని పేర్కొన్నారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు జరుగుతాయన్నారు. 12న ధర్మతాళ్లగుడెం, 13న ప్రత్తిపాక, గుండుగుడెం,చింతరేవుపల్లి, 14 న రామవరపుపాడు, అడవివెంకన్నగుడెం ,15న వీఆర్‌పురం, వడ్డిగూడెం , 17న రాజుపేట గ్రామాల్లో సభలు జరుగుతాయని తహసీల్దార్ తెలిపారు.

ఈ–జిల్లా మేనేజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిధిలో ఈ–జిల్లా మేనేజర్ పోస్టు నియామకానికి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లాకు ఈ–మేనేజర్ పోస్టును మంజూరు చేసిందని తెలిపారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నెలకు రూ.22,500 వేతనం చెల్లిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 26వ తేదీ సాయంత్రం 5గంటల వరకు కార్యాలయపు పని దినాల్లో కలెక్టరేట్ కార్యాలయంలోని తపాల విభాగం ప్రత్యేక కౌంటర్‌లో స్వయంగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అదే కౌంటర్ నుంచి తగిన రశీదు పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కలెక్టర్ సూచించారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని బంగారుమెట్ట, కిలగాడ పంచాయతీలోని గల సరియాపల్లి, కుజభంగి, చెరువుపాకల, మలకరిపుట్టు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు.ఆయా గ్రామాల గిరిజనులతో ప్రభుత్వ పథకాల అమలుతీరు, సమస్యలను తెలుసుకున్నారు. బంగారుమెట్టలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న గ్రామసచివాలయ భవనాన్ని పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో రచ్చబండల వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించి వినతులు స్వీకరించారు. చెరువుపాకలలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ కాలనీలో బోరు, సిరియాపల్లిలో రూ.5లక్షలతో డ్రైనేజీ, కుజభంగిలో రూ.5లక్షలతో సీసీ రోడ్ల పనులు నెలాఖరుకు ప్రారంభిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన పల్లెలో సమస్యలు తెలుసుకుంటూ, వాటి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కోవిడ్ కారణంగా రాష్ట్రంలో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తినా ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తూ దేశంలోనే గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు, పెదబయలు ఎంపీపీలు అరిసెల సీతమ్మ, బొండా వకహాలమ్మ, సర్పంచులు రత్న, భాగ్యవతి, ఎంపీటీసీ కొండమ్మ, మండల వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన గిరి విద్యార్థులకు అభినందన



ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటిన గిరిజన విద్యార్థులతో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : విశాఖపట్నంలోని మారికవలస గిరిజన గురుకుల శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకున్న గిరిజన విద్యార్థులు నీట్, జేఈఈ, ఐఐటీ, లాసెట్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని సోమవారం పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ కలిసి అభినందించారు. నీట్- 2023 ప్రవేశ పరీక్షకు 28 మంది గిరిజన విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు, ఐఐటీ జేఈఈ మెయిన్స్‌కు 38 మంది హాజరు కాగా ముగ్గురు, జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ప్రవేశ పరీక్షల్లో 27 మంది హాజరు కాగా ముగ్గురు అర్హత సాధించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేని వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యను అందుకునేలా ఐటీడీఏ ఎప్పుడు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మారికవలస ఐఐటీ,నీట్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఎల్. శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పాల్గుణ



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం కలిశారు. అరకు నియోజకవర్గంలో మారుమూల గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌రోడ్డు పనులు, తాగునీటి పథకాలు మంజూరు, తాగునీటి వనరుల క్లోరినేషన్ తదితర పనుల విషయాలను కలెక్టర్‌కు తెలియజేశారు. అలాగే డుంబ్రిగుడ మండలం కించమండ సమీపంలోని గెడ్డపై వంతెన నిర్మాణ పనుల ప్రారంభానికి తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

సేఫ్టీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న సేఫ్టీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ (ఏడాది వ్యవధి), ఫైర్ సేఫ్టీ (6 నెలలు), కెమికల్ సేఫ్టీ (3 నెలలు), ఆఫీస్ ఆటోమేషన్ సేఫ్టీ (3 నెలలు) కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99123 40281, 93469 61049 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. గాంధీ కలలుకన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైందరు. మండలంలోని బూదరాళ్లలో నూతనసచివాలయ భవనాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ కావలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. గతంలో సమస్యలు పరిష్కారం కోసం మండల కేంద్రం లేదా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీని మూలంగా గిరిజనులు చాలా రకంగా ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. సీఎం జగనన్న రెండువేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను అందిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో జగనన్న పాలనలో కొనసాగుతున్న సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం శివారు గ్రామాలను కూడా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, ఎంపీటీసీ కుమారి, మాజీ సర్పంచ్, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ సుమర్ల సూరిబాబు,మండల కన్వీనర్ సుధాకర్, ఎంపీటీసీలు అప్పారావు, మల్లికార్జున్, సర్పంచ్ సోమన్న దొర, రాజుబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ రమేష్, తదితరులు

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి, కోరాపల్లి పంచాయతీ పరిధిలో అలగాం, ఎస్తేరు గ్రామాల్లోని రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయం విభాగం రైతు సాధికార సంస్థ ఎం.నిటాపుట్టు యూనిట్ ఇన్‌ఛార్జీ ఎం ప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు బీజామృతం ఉపయోగం గూర్చి, వరి విత్తనాలు బీజామృతంతో శుద్ధి వంటి అంశాలను ఆయన వివరించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన నిర్వహించారు. వరి నారు తీసిన తరువాత బీజామృతంతో శుద్ధి చేసి నాటుకుంటే వరిలో వచ్చే అగ్గితెగుల, పొడతెగుళ్ల అరికట్టవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండిన పంటలు ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటాయని, మన ఆరోగ్యాలు కాపాడుకోవచ్చన్నారు. రసాయన ఎరువులతో అనారోగ్యంతో పాటు భూసారం దెబ్బతింటోందన్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. వ్యవసాయ పెట్టుబడిలేని ప్రకృతి సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమై పంటలేకాకుండా దిగుబడి కూడా పెరుగుతుందని ఆయన చెప్పారు. మిశ్రమ పంటలు వేసుకుంటే ఆదాయం మెరుగుపడుతుందని సూచించారు. కోరాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం న్యూట్రిషన్ కూరగాయ బెడ్స్ తయారీ చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసాద్

క్యాంపస్ సెలక్షన్‌లో 100 మంది ఎంపిక



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్‌వర్మ

అనకాపల్లిటౌన్ : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో సోమవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. బహుళజాతి కంపెనీలైన అమెజాన్, టెక్ మహీంద్రా, హెచ్‌జీఎస్ కంపెనీల ప్రతినిధులు 200 మంది విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్‌రమేష్ చెప్పారు. ఈ పరీక్షలో 100 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. కంపెనీల ప్రతినిధులు శ్రీకాంత్‌వర్మ, అధ్యాపకులు ఎస్.ఆర్.జమీర్, కె.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ పెద్ద పులి కలకలం



పులి సంచార ప్రాంతంలో ట్రాప్ కెమెరాను అమర్చుతున్న అటవీశాఖ అధికారులు



అటవీశాఖ అధికారులు సేకరించిన పులి పాదముద్రలు

- దేవరాపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దులో సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు
- పాదముద్రలను సేకరించి పెద్ద పులివేనని నిర్ధారించిన అటవీశాఖ అధికారులు
- పులి జాడ గుర్తింపునకు ట్రాప్ కెమెరాల ఏర్పాటు

దేవరాపల్లి: జిల్లాలో మళ్లీ పెద్ద పులి కలకలం మొదలైంది. మండలంలోని ఇసుక గెడ్డ మినీ రిజర్వాయర్‌కు సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజులుగా ఈ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు గిరిజనులు చెప్పడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యూనియల్ వారియర్స్ కన్సర్వేషన్ సొసైటీకి చెందిన నిపుణుల బృందం (టైగర్ ఎక్స్‌పర్ట్) పులి సంచరిస్తున్న ప్రాంతంలో పాద ముద్రలను సోమవారం పరిశీలించింది. అనంతరం పెద్ద పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించారు. దేవరాపల్లి-అనంతగిరి మండలాల సరిహద్దులో పెద్ద పులి సంచరిస్తున్న అటవీ ప్రాంతంలో పులి జాడ కోసం ట్రాప్ కెమెరాలను అమర్చినట్లు జీనబాడు రేంజర్ వి.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవళ్లపాలెం, జీనబాడు అటవీ ప్రాంతం నుంచి ఇసుకగెడ్డ మినీ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న బుచ్చెంపాలెం సమీపంలో పెద్ద పులి సంచరించిన ప్రాంతంలో అడుగు జాడలను పరిశీలించిన అనంతరం నిర్ధారించామన్నారు. పెద్ద పులి సంచరిస్తున్న దేవరాపల్లి మండలం బుచ్చెంపాలెంతోపాటు వాలాబు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని గిరిజనులకు ఆయన సూచించారు. అటవీశాఖ అధికారులు పెద్ద పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారించడంతో దేవరాపల్లి, అనంతగిరి మండలాల ప్రజలు ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

సురక్షతో సమస్యలు పరిష్కారం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కొట్నాపల్లిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ రకాల 1542 ధ్రువపత్రాలతో పాటు రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురక్ష పథకం ద్వారా గిరిజనుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు.

జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, ఎంపీడీవో వెంకటరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మండల అధ్యక్షుడు కొండబాబు, డీటీ రంగారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, సర్పంచ్ కాకరి బొంజుబాబు పాల్గొన్నారు.

జిల్లాలో 210 ఫిష్ షాపులు



చెన్నైలో జరుగుతున్న సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకిస్తున్న శిల్పా హేచరీస్ ప్రతినిధులు

పాయకరావుపేట : అనకాపల్లి జిల్లాలో ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా 210 ఫిష్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్టు మత్స్యశాఖ జిల్లా అధికారి టి.ప్రసాద్ తెలిపారు. మండలంలో గల పెంటకోట గ్రామ సమీపాన గల శిల్పా హేచరీలో సోమవారం ఘనంగా చేప రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైన్నైలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఇక్కడ హేచరీస్ యాజమాన్యంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 210 ఫిష్ షాపుల ఏర్పాటులో భాగంగా ఇప్పటి వరకూ 65 షాపులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి షాపునకు 10 శాతం లబ్దిదారు చెల్లిస్తే 40 శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2 వేల రొయ్యల చెరువులు వుండగా వీటిలో 700 రొయ్యలు చెరువులు పాయకరావుపేట మండలంలోనే ఉన్నాయన్నారు. అనుమతులు లేని చెరువులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనకు ఎంపికైన శిల్పా హేచరీని రూ.11 కోట్లతో నిర్మించడం జరిగిందని హేచరీ మేనేజింగ్ పార్టనర్స్ బి.శిల్పానాయక్, మంజునాయక్ తెలిపారు. ఇందులో కేంద్రం రూ.కోటి 50 లక్షలు రాయితీ కల్పించిందన్నారు. రాష్ట్రంలో ఐదు హేచరీలు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనకు దరఖాస్తు చేసుకోగా మొదటగా శిల్పా హేచరీ పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుందన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

చింతపల్లి రూరల్: పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో చింతపల్లి, గూడెం మండలాలకు చెందిన 150 మంది గర్భిణులకు డాక్టర్ రుక్మిణీ గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు.హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచామన్నారు. అలాగే గర్భిణులు పాటించవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పోషకాలు గురించి వారికి తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధా శారద, సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 113 మంది గర్భిణులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 33 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి, ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. గర్భిణులందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనికాలజిస్ట్ సత్యవాణి, సీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో కూడా వైద్యాధికారులు నరేంద్ర, దిలీష్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి పాముకాటు

వై.రామవరం: మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు పాముకాటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మండలంలోని కోట సచివాలయం పరిధిలోని పుట్టపల్లి గ్రామానికి చెందిన యువతి కడబాల అపురూప(20) సోమవారం పొలంలో తుప్పలు తొలగిస్తుండగా పాముకాటుకు గురైంది. వెంటనే ఆమె స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తామని వైద్యాధికారి చైతన్య తెలిపారు. మండలంలోని కె.యర్రగొండ సచివాలయం పరిధిలోని పెద్ద ఊలెంపాడు గ్రామానికి చిట్టోజి చంద్రవేణి(40) అనే గిరిజన మహిళ కూడా సోమవారం పాముకాటుకు గురయ్యింది. పొలంలో పని చేస్తుండగా పాము కరిచిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెను కూడా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకురావడంతో వైద్యాధికారి చైతన్య చికిత్స అందిస్తున్నారు.



వై.రామవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చంద్రవేణి

మృతుడి వివరాలు లభ్యం

కశింకోట : ఉగ్గినపాలెం వద్ద మూడు రోజుల క్రితం అపస్మారక స్థితికి చేరి ఆస్పత్రికి తరలించేటప్పటికి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. అనకాపల్లిలోని పూడిమడల ప్రాంతానికి చెందిన కంచర్ల శివకృష్ణ (55)గా మృతుడి బంధువుల ద్వారా గుర్తించామన్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఖాళీ సీసాలు ఏరుకొని విక్రయించి జీవనం సాగిస్తున్న శివకృష్ణ ఈ నెల 7న ఉగ్గినపాలెం వద్ద ఐఒసీ బంకు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, బంధువులు వచ్చి గుర్తించడంతో పోస్టుమార్టం జరిపించి వారికి అప్పగించామన్నారు. పది రోజులుగా మృతుడు తమ ఇంటికి కూడా చేరలేదని కుటుంబ సభ్యులు చెప్పారన్నారు. మద్యం అలవాటు ఉండడంతో ఎండ తీవ్రత వల్ల గాని అపస్మారక స్థితికి చేరి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

నక్కపల్లి: రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో గత నెల నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల చిన్నారులు గొర్ల నిత్య(10వ తరగతి), నాగస్వాతిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ తెలిపారు. ఇప్పటికే వీరిని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మలు ప్రత్యేకంగా అభినందించినట్టు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 14న విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు పర్యవేక్షకులుగా నాగప్రవీణ్ వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు.

కవయిత్రి స్వాతికి కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం

రావికమతం: కొత్తకోటకు చెందిన ప్రముఖ కవయిత్రి స్వాతి సోమవారం హైదరాబాద్‌లో కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం అందుకున్నారు. గతంలో ఆమె రచనలు అనేక సందర్భాల్లో ప్రశంసలు అందుకున్నాయి. తాజాగా మౌన మేఘాలు అనే కవితకు కొలకలూరి ఇనాక్ జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్వాతి ప్రఖ్యాత కవి కొలకలూరి ఇనాక్ సహా పలువురు ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఆమె భర్త కృష్ణమోహన్ కొత్తకోట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.



కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న స్వాతి

ప్రగతి స్కాలర్‌షిప్‌నకు 13 మంది ఎంపిక

సింహాచలం: ఢిల్లీలోని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అందించే ప్రగతి స్కాలర్‌షిప్ 2022-23 సంవత్సరానికిగాను పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చదువుతున్న 13 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినులను కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ అఖిలభారత సాంకేతిక విద్యా మండలి కేవలం విద్యార్థినులకు మాత్రమే అందించే ప్రగతి స్కాలర్‌షిప్‌నకు కళాశాల నుంచి దరఖాస్తు చేయగా 13 మంది ఎంపికయ్యారన్నారు. ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున స్కాలర్ షిప్ వస్తుందని తెలిపారు.



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

280 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్, జీపు స్వాధీనం

పెదబయలు : సీతగుంట పంచాయతీ సీతగుంట జంక్షన్‌లో సోమవారం మహీంద్ర జీపులో 280 కిలోల గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్టు ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. సీతగుంట జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా కొంత దూరంలో పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తి గమనించి వెంటనే బైక్ తిప్పి వేగంగా వెళ్లాడని, దీని వెనుక వస్తున్న జీపు డ్రైవర్ జీపును వెనక్కి తిప్పి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వెంటనే జీపు ఆపి తనిఖీ చేయగా తొమ్మిది సంచుల్లో 280 కిలోల గంజాయి బయటపడిందని, గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితులు ఇంజరి పంచాయతీ మల్లెపుట్టు గ్రామానికి చెందిన పాత్రొంగి కొండబాబు, ఒడిశా రాష్ట్రం పాడువ బ్లాక్ పాతులుంగి పంచాయతీ ఒండ్రుగెడ్డ గ్రామానికి చెందిన గంప ఉమాశంకర్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.



పట్టుబడ్డ నిందితులు, గంజాయి, స్వాధీనం చేసుకున్న జీపుతో ఎస్‌ఐ మనోజ్‌కుమార్

కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీని సోమవారం వైద్యులు విజయ వంతంగా నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో కార్డియోథోరసిక్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో వైద్యులు రెండున్నర గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా వంగర గ్రామానికి చెందిన డి.ధనుంజయ అనే 18 ఏళ్ల యువకుడు గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. ఇతర ఆరోగ్య సమస్యలూ ఉన్నాయి. దీంతో కేజీహెచ్‌లో కార్డియాలజీ వైద్యులను సంప్రదించాడు. గుండెలో రంధ్రం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. తక్షణం ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాలని భావించారు. ఆరోగ్యశ్రీలో రోగికి సర్జరీ సోమవారం విజయవంతంగా పూర్తి చేశారు. రోగి ఆరోగ్యంగా ఉన్నాడని, ఐసీయూకి తరలించామని కేజీహెచ్ కార్డియోథోరసిక్ విభాగాధిపతి డాక్టర్ కె.మణిత చెప్పారు. రోగి ధనుంజయను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించారు.

అందుబాటులో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్

ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీకి అవసరమైన పరికరం ఇటీవల మరమ్మతులకు గురైంది. దీంతో కొద్ది నెలలుగా గుండె శస్త్ర చికిత్సలు జరగడం లేదు. కలెక్టర్ మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చొరవ తీసుకొని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె రూ.40 లక్షల విలువ చేసే టెంపరేచర్ కంట్రోల్ మెషిన్‌ను మంజూరు చేశారు. ఈ మిషన్‌ను ఆస్పత్రిలో అమర్చిన తరువాత తొలిసారిగా సోమవారం ధనుంజయకు ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించారు.



రోగిని పరామర్శిస్తున్న కేజీహెచ్ సూపరిండెంటెంట్ శివానంద్